క్లుప్తంగా

పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటన

మాచర్ల: పట్టణంలోని 9, 11 వార్డుల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. వీరి వెంట మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, అనుబంధ సంఘాల నాయకులు వజ్రానాయక్, షేక్ నాగూర్, జి.కృష్ణ, కె.దానబాబు, డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



మాచర్ల: డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు ఆర్పీలు కృషి చేయాలని మెప్మా ప్రాజెక్టు మాచర్ల మేనేజర్ శ్యామలాదేవి సూచించారు. పురపాలక సంఘ పరిధిలోని మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్యామలాదేవి మాట్లాడుతూ మహిళలను చైతన్యవంతుల్ని చేసి డ్వాక్రా సంఘాల్లో చేరేలా కృషి చేయాలని కోరారు. బ్యాంకుల ద్వారా వచ్చే రుణాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు వివరించాలన్నారు. డ్వాక్రా మహిళలకు అనుమానాలు ఉంటే నివృత్తి చేయాలని చెప్పారు. పట్టణంలో ఉన్న అన్ని సమాఖ్యల ఆర్పీలతో సమీక్షించారు. కార్యక్రమంలో సీఈఓలు రాజశేఖర్, అంజలి పాల్గొన్నారు.

25 నుంచి వీర్ల అంకమ్మతల్లి ఆలయ తిరునాళ్ల



దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని వీర్ల అంకమ్మతల్లి ఆలయ వార్షిక తిరునాళ్ల మహోత్సవాన్ని ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. అందుకు సర్వం సిద్ధమైంది. ఐదు రోజుల పాటు జరిగే కొలుపుల తిరునాళ్ల ఉత్సవాలకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి వార్షిక కల్యాణానికి ప్రత్యేకంగా వేదిక నిర్మించారు. ఐదు రోజుల పాటు ఆలయంలో అన్ని రకాల పూజలు, అభిషేకాలుచ హోమాలు నిర్వహించేందుకు వేదపండితులు, అర్చకులు పూజ సామాగ్రిని సిద్ధం చేశారు. బొడ్డురాయికి జలాభిషేకం చేయటం ద్వారా ప్రారంభమయ్యే తిరునాళ్ల అమ్మవారి వార్షిక కల్యాణంతో ముగుస్తుంది. ఐదు రోజుల పాటు మహా అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఐఎంఏ సభ్యుని కుటుంబానికి సాయం



పిడుగురాళ్ల: ఐఎంఏ సభ్యుడు చల్లగుండ్ల శ్రీరామూర్తి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా వారికి పిడుగురాళ్ల ఐఎంఏ అధ్యక్షులు దూళ్లిపాళ్ల భరత్‌కుమార్, సభ్యులు ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ద్వారా రూ.6 లక్షలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షులు దూళ్లిపాళ్ల భరత్‌కుమార్ మాట్లాడుతూ... శ్రీరామూర్తి శ్రీకాంత్ నర్సింగ్‌హోమ్ ద్వారా, చల్లగుండ్ల చారిట్రబుల్ ట్రస్టు ద్వారా ఉచిత క్యాంపులను పల్నాడు ప్రాంతంలో నిర్వహించారని గుర్తు చేశారు. పిడుగురాళ్ల ఐఎంఏ శాఖలో శాశ్వత సభ్యంలో కలిగి ఉండటం, ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ సభ్యత్వం కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారి పెద్ద కుమారుడు చల్లగుండ్ల శ్రీనివాసరావుకు గురజాలలోని వారి నివాసంలో రూ. 6 లక్షల చెక్కును అందజేయటం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ డాక్టర్ ఆలా సాంబశివరావు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



హనుమంతరావు

మాచర్ల రూరల్: కుటుంబంలో ఏర్పడ్డ మనస్పర్థలతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని భైరవునిపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సిరికొండ హనుమంతరావుకు 20 ఏళ్ల క్రితం గుత్తికొండకు చెందిన సునీతతో వివాహం జరిగింది. ముగ్గురు కుమార్తెలున్నారు. భార్యాభర్తలు గొడవలు పడుతున్నారు. భర్తను వదిలి పుట్టింటికి వెళ్లింది. గత వారం క్రితం హనుమంతరావు తన ముగ్గురు కుమార్తెలను తీసుకొని భార్య సునీత వద్దకు వెళ్లి కాపురానికి రావాలని అడిగితే ఆమె అంగీకరించలేదు. దీంతో కలత చెందిన హనుమంతరావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్



మాట్లాడుతున్న తహసీల్దార్ మధుబాబు

పిడుగురాళ్ల: తహసీల్దార్ కార్యాలయంలో సమస్యలను పరిష్కరించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చూస్తామని తహసీల్దార్ మధుబాబు అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మధుబాబు మాట్లాడుతూ.. బాధితుల నుంచి వచ్చే అర్జీలను వాయిదాలు వేయకుండా అప్పటికప్పుడే పరిష్కరించాలని, పనిలో అలసత్వం వహించి బాధితులను ఇబ్బందులకు గురిచేసే వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం వేసవి కాలం దృష్ట్యా అర్జీదారులకు మంచినీటి సౌకర్యం కల్పించి, ఎండలో కూర్చోకుండా తగు జాగ్రత్తలు తీసుకొవాలని ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఉదయమంతా గ్రామాల్లో బాధితుల పని కోసం ఫీల్డ్‌లో ఉన్నప్పటికీ సాయంత్రం 4 గంటలకు కచ్చితంగా కార్యాలయంలో అందుబాటులో ఉండాలని తహసీల్దార్ మధుబాబు సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

చాకిరి భూములు అమ్మడం నేరం

తుమృకోట(రెంటచింతల): మండలంలోని తుమృకోటలో నున్న సీతారామస్వామి, రామలింగేశ్వర స్వామి, జనార్ధనస్వామి ఆలయాలకు చెందిన చాకిరి భూములను అమ్మడం, కొనడం చెల్లుబాటు కావని ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జనార్ధనస్వామి ఆలయంలో సన్నాయి, బజంత్రీ, భజన, మోత కాపులు(చాకిరి మాన్యాలు)లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాకిరి భూములను విక్రయించిన ఇప్పటికీ ఆన్‌లైన్‌లో ఆ భూములు అన్నీ కూడా ఆలయాల పేర్ల మీదుగానే నమోదై ఉన్నాయని చెప్పారు. ఈ భూములను ఆలయాలకు చాకిరి చేస్తూ అనుభవించడానికి మాత్రమే అర్హత ఉంటుందన్నారు. ఆలయాలకు చాకిరి(సర్వీస్) చేయని వారి భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామంలోని సీతారామస్వామి ఆలయానికి 14.70 ఎకరాలు, రామలింగేశ్వర స్వామి ఆలయానికి 11.88 ఎకరాలు, జనార్ధనస్వామి ఆలయానికి 54.12 ఎకరాల భూములు ఉన్నాయని వివరించారు.

పెన్షనర్ల ప్రయోజనాలు కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు

మాచర్ల రూరల్: పెన్షనర్స్ ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు స్వస్తి చెప్పాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు కోరారు. సోమవారం స్థానిక పెన్షనర్స్ భవనంలో నందా నరసింహయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లులు, పెన్షనర్స్ ప్రయోజనాలు దెబ్బతీసేలా ఉన్నాయని, వాటిని అమలు పరిస్తే ఎంతో నష్టదాయకమని హెచ్చరించారు. ఇప్పటికే పెన్షనర్స్ ప్రయోజనాలు తగ్గించటం జరిగిందని, పార్లమెంట్‌లో ఆర్థిక బిల్లును వ్యతిరేకించి కేవలం పెన్షన్‌ల పైనే జీవనం కొనసాగిస్తున్న ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన సలహాదారుడు చంద్రమౌళి, రామనాథ శర్మ, కార్యదర్శి గౌస్ మొహిద్దీన్, చంద్రయ్య, అంజయ్య, వెంకటరెడ్డి, పాపిరెడ్డి, చంద్రారావు, బాబు, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాంధవ్యాలు మెరుగుపడి పూర్వీకులను స్మరించుకోవాలి

సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఉల్లం అజయ్



అన్నసంతర్పణ చేస్తున్న న్యాయమూర్తి ఉల్లం అజయ్, కిరణ్మయి దంపతులు

సత్తెనపల్లి: బంధాలు, అనుబంధ బాంధవ్యాలు మెరుగుపడాలని, పూర్వీకులను స్మరించుకోవాలని తెలంగాణ రాష్ట్రం సిర్పూర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఉల్లం అజయ్ అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో ఉన్న హైకోర్టు న్యాయవాది ఉల్లం శేషగిరిరావు కార్యాలయం వద్ద దివంగత ఉల్లం వెంకటేశ్వర్లు, దివంగత తోట సత్యనారాయణ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో మనవడు న్యాయమూర్తి ఉల్లం అజయ్, ధర్మపత్ని కిరణ్మయి ఆర్థిక సహాయంతో 120 మందికి సోమవారం ఉచితంగా భోజనం అందించారు. ముందుగా వీరి తాత ఉల్లం వెంకటేశ్వర్లు విగ్రహానికి పులమాల వేసి నివాళులర్పించారు. పూర్వీకులను స్మరించుకుంటూ ప్రతి సోమవారం అన్నసంతర్పణ చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఉల్లం శేషగిరిరావు, దివ్వెల శ్రీనివాసరావు, ఉసిరికాయల సాంబశివరావు, నర్రా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న సాంఘిక నాటకం



సాంఘిక నాటకంలోని ఓ సన్నివేశం

పెదకూరపాడు: అంతరించిపోతున్న నాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు పాటిబండ్ల గ్రామ కళాకారులు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఇటీవల కాలంలో పాటిబండ్ల ముగ్గురు రాజుల దేవాలయం సిల్వర్ జూబ్లీ సందర్భంగా గ్రామంలోని కళాకారులు పలువురు సాంఘిక నాటకాన్ని ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని సాగర్‌మాత యువ నాట్య కళా మండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంఘిక నాటకం రౌడీ సర్దార్ నాటకం ఆహుతులను ఆకట్టుకుంది. అంతరించిపోతున్న కళలను ప్రోత్సహించేందుకు నాటక ప్రదర్శన చేస్తున్నట్లు నిర్వాహకులు తెలపడంతో కళాభిమానులు, వీక్షకులు సంతోషం వ్యక్తం చేశారు.

సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు..

రెంటచింతల: ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్టి విత్తనాలు అందజేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగలు (12 కెజీలు) బ్యాగ్ రూ.61.50, జనుము (10 కేజీలు) బ్యాగ్ రూ.54.50, పిల్లి పెసర(8 కేజీలు) బ్యాగ్ రూ.90 లకే అందిస్తున్నట్లు వివరించారు. ఒకొక్క రైతులకు 2.50 ఎకరాలకు సరిపడ పచ్చిరొట్టి విత్తనాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పచ్చిరొట్టి విత్తనాలు అవసరమైన రైతులు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో పట్టాదారు పాస్‌బుక్ నకళ్లను అందజేయాలని కోరారు.

చిలకలూరిపేటలో నాలుగు దుకాణాలు దగ్ధం

చిలకలూరిపేటటౌన్: ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో పలు దుకాణాలు దగ్ధమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పట్టణంలోని సుభానినగర్ లాహిరి ఆస్పత్రి పక్కనే ఉన్న పిల్లల ఆటవస్తువులు విక్రయించే దుకాణాలు దగ్ధమయ్యాయి. కొన్నేళ్ల కిందట అందెల సుమంత్ కోటిబాబు పాస్టిక్ ఆటవస్తువులు విక్రయాలకు వరసగా ఉన్న మూడు దుకాణాలు అద్దెకు తీసుకుని నడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వ్యాపారం అనంతరం దుకాణం మూసివేసి ఇంటి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో సదరు దుకాణంలో నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి దుకాణం యజమాన్ని కోటిబాబుకు, అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం తెలిపారు. అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటన చేరుకుని మంటల్ని అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే దుకాణాలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

రేపు లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం–చిలకలూరిపేట డొంక రోడ్డులో కుప్పగంజివాగు పక్కనే కొలువైయున్న శ్రీ లక్ష్మీగణపతి ఆలయ నాలుగో వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 23న నిర్వహించనున్నట్లు పూజారి కొండవీటి కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం స్వామివారిని అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అదేరోజు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నారు. సాయంత్రం హైస్కూలు విద్యార్థులచే కోలాట ప్రదర్శన జరగనుంది. 2015లో గ్రామానికి చెందిన గాలి సాంబయ్య వాయుప్రతిష్ట నిర్వహించగా, 2021లో ఆలయాన్ని పునర్ నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు.

25 నుంచి రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

దాచేపల్లి: పల్నాడు జిల్లా దాచేపల్లిలో రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఈనెల 25వ తేదీ నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొప్పుల గిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాక్‌పాట్, సేద్యం, ఆరు పళ్లు, నాలుగు పళ్లు, జతపళ్లు, పాలపళ్లు విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయని చెప్పారు. ఆసక్తి కలిగిన రైతుల తమ ఎడ్ల జతలతో రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి ఈ పోటీల్లో పాల్గొన్నాలని కోరారు. పూర్తి వివరాలకు 9985323366 నంబర్‌ని సంప్రదించాలని పేర్కొన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం



పిడుగురాళ్లరూరల్: వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు... మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన పర్చూరి రమేష్‌కు చెందిన ఐదు ఎకరాల వరిగడ్డి వామికి నిప్పు అంటుకోవడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించటంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.60 వేల వరకు నష్ట వచ్చిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు 44 మంది హాజరు

జెట్టిపాలెం(రెంటచింతల): జెట్టిపాలెం ఆదర్శ పాఠశాల(ఏపీ మోడల్ స్కూల్) 2025–2026 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి సోమవారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 44 విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ కె.పాపయ్య తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా మొత్తం 70 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ప్రవేశ పరీక్షలో కనీస మార్కులు ఓసీ, బీసీ విద్యార్థులు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు రావాలన్నారు. విద్యార్థులకు ప్రవేశ పరీక్షలో పొందిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించడం జరుగుతుందని వివరించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

సత్తెనపల్లి: వివాహిత మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామానికి చెందిన గుంటగాని వేణు, కట్టవారిపాలెంకు చెందిన శిరీష(34)కు 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 14 ఏళ్ల కుమారుడు, 13 ఏళ్ల కుమార్తె ఉన్నారు. వేణు బేల్దారి మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యభర్తలకు మధ్య కుటుంబ కలహాల కారణంగా ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత భర్త, పిల్లలు నిద్రిస్తున్న సమయంలో శిరీష ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందింది. అయితే శిరీష మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి భర్త వేణును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

నాటుసారాతో అనర్థాలు తెచ్చుకోవద్దు

తహసీల్దారు కె.పుల్లారావు

నకరికల్లు: నాటుసారా జోలికి వెళ్లి అనర్థాలు తెచ్చుకోవద్దని తహసీల్దారు కె.పుల్లారావు హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చేజర్ల గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలను నాటుసారా కేసులలో తహసీల్దారు ఎదుట ఎక్సైజ్ పోలీసులు సోమవారం హాజరు పరిచారు. బైండోవర్ చేసిన సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఏ కేటగిరీ పరిధిలోని చేజర్ల గ్రామంపై ఎక్సైజ్ శాఖ దృష్టి సారించిందన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.



నాటుసారా కేసులో మహిళలను హెచ్చరిస్తున్న తహసీల్దారు పుల్లారావు

బైక్– లారీ ఢీకొని పలువురికి గాయాలు





మాచర్ల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న చంద్రానాయక్, శ్రావణ్ నాయక్

వెల్దుర్తి: వేగంగా వెళ్తున్న లారీ, ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని శిరిగిరిపాడులో అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. దావుపల్లి గ్రామానికి చెందిన ఉద్యానవన శాఖ అసిస్టెంట్ కె.శ్రావణ్ నాయక్, చంద్రా నాయక్ దావుపల్లి నుంచి ద్విచక్ర వాహనం పై శిరిగిరిపాడు సచివాలయానికి వస్తుండగా మాచర్ల నుంచి యర్రగొండపాలెం వేగంగా వెళ్తున్న లారీ చెక్ పోస్టు వద్ద ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న శ్రావణ్‌నాయక్, చంద్రా నాయక్ రోడ్డు పై ఎగిరిపడ్డారు. చెక్‌పోస్టు వద్ద పనిచేస్తున్న సిబ్బంది బంధువులకు, 108 సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

భూ రీ సర్వే వేగవంతం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్ కుమార్

మాచర్ల రూరల్: భూ వివాదాలను పరిష్కరించేందుకు చేపడుతున్న భూ రీ సర్వేలో నిర్లక్ష్యం లేకుండా వేగవంతంగా పనిచేయాలని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సర్వే ఉద్యోగులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో భూ వివరాల కోసం రీ సర్వే రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. రీ సర్వేలో సమష్టిగా పనిచేయాలని కొంతమంది ఉద్యోగులు నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్నట్లు నా దృష్టికి వచ్చిందని, ఉద్యోగ బాధ్యతలలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. బాధ్యతగా విధులు నిర్వహించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులందరూ మండల సర్వేయర్ ఆదేశానుసారం పనిచేయాలని, రీ సర్వేలో ఉద్యోగులంతా కో ఆర్డినేట్‌గా విధులు నిర్వహించి రైతులకు ప్రయోజనాలు కలిగేలా పనిచేయాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ బత్తుల వాణి, ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్, సర్వేయర్ వై.రఘుపతి, సచివాలయ ఉద్యోగులు జింకల ఆదినారాయణ, మునీ నాయక్, దుర్గ, చంద్రం, కోటేశ్వరరావు, అంజి, బాలాజి, శ్రీనివాసరావు, ఏసురాజు, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్ పోతుగంటికి సత్కారం



ఏజీకేఎంలో పోతుగంటిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ బాధ్యులు

సత్తెనపల్లి: వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన ఆర్యవైశ్య సంఘ నాయకుడు, వాణిజ్య విభాగం జిల్లా నాయకుడు పోతుగంటి రామకోటేశ్వరరావును సోమవారం పలువురు అభినందించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆయనను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ముందుగా ఏజీకేఎం కళాశాలలో వాకర్స్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టి సాంబశివరావు ఆధ్వర్యంలో చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో దాదాపు 40 మంది సభ్యులు పాల్గొన్నారు. అనంతరం భవిరిశెట్టి వారి వీధిలో ఆర్యవైశ్య యువజన సంఘం నాయకుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో, అలాగే ఏరియా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు జవ్వాజి రామమోహనరావు ఆధ్వర్యంలో పోతుగంటి రామకోటేశ్వరరావుకు చిరు సత్కారాలు చేశారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

సత్తెనపల్లి: వేసవి కాలంలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు మినరల్ వాటర్‌తో కూడిన మజ్జిగ పంపిణీ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆర్య వైశ్య యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ అన్నారు. పట్టణంలోని గడియార స్తంభం సమీపంలో గాంధీ చౌక్ సెంటర్‌కి వెళ్లే రోడ్డులో సోమవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు బచ్చు కొండలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుంచి వేసవి కాలం మొత్తం మజ్జిగ ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న కొత్త రామకృష్ణ, దేవరపల్లి కాశి బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైవ్య నాయకులు పెరుమాళ్ళ లక్ష్మీశివన్నారాయణ, జవ్వాజి రామమోహన్‌రావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, చౌట శ్రీనివాసరావు, దివ్వెల శ్రీనివాసరావు, దేవతి సుబ్బారావు(మెమంటో), భవిరిశెట్టి సుబ్రమణ్యం, దేవరపల్లి రాఘవ, భవిరిశెట్టి హరికృష్ణ, చెక్క రవికుమార్ తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు



కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న ప్రసాదరావు, కార్మిక సంఘు నాయకులు

సత్తెనపల్లి: భవన నిర్మాణ కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలను నిలిపివేస్తూ జారీ చేసిన 1214 మెమోను వెంటనే రద్దు చేయాలని భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) పల్నాడు జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక గార్లపాడు బస్టాండ్ సెంటర్‌లోని భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు జిల్లాలోని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు, వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావులను కలసి వినతి పత్రం ఇచ్చి పెండింగ్‌లో ఉన్న రూ.1.68 కోట్లు విడుదల చేసి కార్మికుల క్లయిమ్‌లకు జమ చేయాలని కోరడం జరిగిందన్నారు. అయినప్పటికీ ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 24న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నాకు పూనుకోవాల్సి వచ్చిందని, భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు మస్తాన్‌రావు, హుస్సేన్ బాబు, కృష్ణ, హిమామ్ వలి, సాంబయ్య, కోట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడికి పంపండి

ఇంటింటి ప్రచారంలో ఎంఈవో



రాజుపాలెం: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఎంఈవో మల్లిఖార్జునశర్మ అన్నారు. మండలంలోని గణపవరం బుడగ జంగాల కాలనీలో మన ఊరు–మన ప్రభుత్వ బడి కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరిగి మీ పిల్లలను బడికి పంపించాలని సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కాలనీవాసులు, మహిళలతో మాట్లాడుతూ మీ పిల్లలందరినీ బడిలో చేర్పించినట్లయితే వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. బడి మానివేయడానికి గల కారణాలు తెలుసుకుని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట విద్యా కమిటీ చైర్మన్‌లు, మహిళా సమాఖ్య అధ్యక్షులు, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.